మంగళవారం 09-7-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 389, పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## భక్తజనసంద్రంగా మారిన పూరి క్షేత్రం

వివరాలు 2లో



## అతిపెద్ద చిన్నారుల ఆస్పత్రిపై దాడి

వివరాలు 3లో




## బీసీసీఐ ఇచ్చిన రూ.125 కోట్లలో ఎవరెంత తీసుకున్నారు

వివరాలు 4లో



## రాధిక 3.0గా ప్రియాంక?

వివరాలు 5లో

# లీకైన పేపర్ ఎంతమందికి చేరింది..?

- 23లక్షల మంది జీవితాలు ఉన్నాయి
- కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీం కోర్టు




ముందడుగు ఢిల్లీ:

దేశంలో జరిగిన నీట్ యూజీ 2024 పరీక్ష లీకైన మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, ఇది 23లక్షల మందితో జీవితాలతో ముడిపడిన అంశం అయినందున.. 'నీట్ రీటెస్ట్'ను తాము చివరి అవకాశంగా పరిగణిస్తామని వెల్లడించింది. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకైందని, అవకతవకలు, అక్రమాలు జరిగాయని, పరీక్షను రద్దు చేయాలని సుప్రీం కోర్టులో మొత్తం 38 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ''నీట్ ప్రశ్నపత్రం లీకైంది అన్న విషయం స్పష్టమైంది. పరీక్ష పవిత్రతను దెబ్బతీశారని రుజువైనా లేదా నేరం చేసిన వారిని గుర్తించలేకపోయినా మేం నీట్ రీ-టెస్ట్‌కు ఆదేశిస్తాం. లీకైన ప్రశ్నపత్రం సోషల్‌మీడియాలో వ్యాప్తి చేశారని తెలిసినా మళ్లీ పరీక్ష నిర్వహించాలని చెబుతాం. కానీ, రీ-టెస్ట్‌కు ఆదేశించే ముందు.. లీకైన పేపర్ ఎంతమందికి చేరిందో తేలాల్సి ఉంది'' అని ధర్మాసనం తెలిపింది.

ఈ సందర్భంగా కేంద్రానికి న్యాయస్థానం కీలక ప్రశ్నలు సంధించింది. ''పేపర్ లీక్‌తో ఇద్దరు విద్యార్థులకే సంబంధం ఉందని అంటున్నారు.. కానీ, అది 23లక్షల మంది జీవితాలతో ముడిపడిన అంశం. అందువల్ల, లీక్ ఎలా జరిగింది అనేది తెలుసుకోవాలి. లీకైన పేపర్ ఎంతమందికి చేరిందో గుర్తించారా? ఎలా చేరిందో తెలుసుకున్నారా?లీకేజీతో లబ్ధిపొందిన విద్యార్థులపై ఏం చర్యలు తీసుకున్నారు?ఎంతమంది విద్యార్థుల ఫలితాలను హోల్డ్‌లో ఉంచారు?వీటికి సమాధానాలు కావాలి. వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు జరగాలి'' అని ధర్మాసనం ఆదేశించింది. అన్నీ పరిశీలించిన తర్వాత దీనిపై తీర్పు చెబుతామని వెల్లడించింది. నీట్ వ్యవహారంపై దర్యాప్తు ఎక్కడిదాకా వచ్చిందో తెలుపుతూ తమకు నివేదిక సమర్పించాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. ప్రశ్నపత్రం తొలిసారి ఎప్పుడు లీకైందన్న విషయాన్ని వెల్లడించాలని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి సూచించింది.



## వర్షం కారణంగా 50పైగా విమానాలను రద్దు

- ముంబాయిలో ఎడతెగని కుండపోత వర్షం
- పాఠశాలలు, కళాశాలలకు సెలవులు

ముందడుగు ముంబాయి:

ముంబయిలో భారీ వర్షా లు కురవడంతో రోడ్లపై వరద పోటెత్తుతున్నది. ఈ భారీ వర్షా ల కారణంగా రైళ్ల రాకపోకలకు సైతం తీవ్రంగా అంతరాయం కలుగుతున్నది. వానల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురుస్తున్నది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 7 గంటల వరకు పలుచోట్ల 300 మిల్లీమీటర్లకు పైగా వర్షం నమోదైంది. భారీ వర్షా ల కారణంగా ముంబైలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదర్ అతలాకుతలమైంది. ఇక్కడ రోడ్లపై నుంచి

మిగతా 2లో

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ వాయిదా

### గురువారం విచారించనున్న హైకోర్టు

ముందడుగు తెలంగాణ:

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్ల విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఇటీవల భారాస నుంచి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై

మిగతా 2లో





## కజిరంగ నేషనల్ పార్క్‌కు భారీ వరద..

- పార్కులో 131 వన్యప్రాణులు మృత్యువాత
- ఆరు ఖడ్గమృగాలు, 117 హాగ్ జింకలు

ముందడుగు అస్సాం:

అస్సాంలో వరద బీభత్సం కారణంగా కజిరంగ జాతీయ పార్కు తీవ్ర ప్రభావానికి గురైంది. పార్కులోకి భారీగా నీరు చేరింది. దీంతో సుమారు 131 వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి.

మిగతా 2లో



ముందడుగు
మంగళవారం, 09-7-2024, హైదరాబాద్

# వర్షం కారణంగా 50పైగా విమానాలను రద్దు

మొదటిపేజీ తరువాయి

రైలు పట్టాల వరకు నీరు నిండిపోయింది. కార్లు రోడ్లపై నీటిలో తేలియాడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సెలవు ప్రకటించింది. భారీ వర్షా లతో వెలుతురు లేని కారణంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్యాహ్నం 2.22 నుంచి 3.40 గంటల వరకు రన్‌వే కార్యకలాపాలను నిలిపివేసింది. దాంతో 50పైగా విమానాలను రద్దు చేయడంతో పాటు ఆయా విమానాలను అహ్మదాబాద్, హైదరాబాద్, ఇండోర్‌కు మళ్లించారు. ఇదిలా ఉండగా.. వరద పరిస్థితిని సమీక్షించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే డిజాస్టర్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ముంబయి గార్డియన్ మంత్రి ఎంపీ లోధా, రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ మంత్రి అనిల్ పాటిల్ సైతం హాజరయ్యారు. సమావేశంలో సీఎం షిండే మాట్లాడుతూ నిన్న రాత్రి నుంచి ముంబయిలో 300 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షం నీటిని తోడేందుకు 200 నీటి పంపులు, 400 బీఎంసీ పంపులు పని చేశాయని.. సెంట్రల్, హార్బర్ లైన్లలో రైళ్లు తిరిగి ప్రారంభమైనట్లు తెలిపారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ వాయిదా

మొదటిపేజీ తరువాయి

అనర్హత వేటు వేయాలని భారాస కోరింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ పిటిషనర్ల తరపు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో అనర్హత వేటు వేయాలన్న సుప్రీంకోర్టు తీర్పులను స్పీకర్ అమలు చేయడం లేదనే విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో విచారణ వాయిదా పడింది.

# కజిరంగ నేషనల్ పార్క్‌కు భారీ వరద..

మొదటిపేజీ తరువాయి

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చనిపోయిన జంతువుల్లో ఆరు ఖడ్గమృగాలు, 117 హాగ్ జింకలు (ఇందులో 98 నీట మునిగి ప్రాణాలు కోల్పోగా.. రెండు జింకలు వాహనాలు ఢీకొట్టి చనిపోయాయి. మరో 17 జింకలు చికిత్స సమయంలో ప్రాణాలు కోల్పోయాయి), రెండు సాంబార్, ఒక ఒట్టర్ సహా మొత్తం 131 వన్య ప్రాణాలు మృత్యువాత పడ్డాయి.

అదేవిధంగా మరికొన్ని హాగ్ జింకలు, రెండు ఖడ్గమృగాలు, సాంబార్ జింకలు, స్కాప్స్ గుడ్లగూబలు, చిత్తడి జింకలు, కుందేలు, ఒట్టర్, ఏనుగు సహా మొత్తం 97 జంతువులను అధికారులు రక్షించారు. ప్రస్తుతం 25 జంతువులు వైద్య సంరక్షణలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో 52 జంతువులను చికిత్స తర్వాత సురక్షిత ప్రాంతంలో వదిలినట్లు పేర్కొన్నారు.

పార్క్‌లో వరద పరిస్థితిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వరద నీటిలో ఓ ఖడ్గమృగం చిక్కుకున్న వీడియోని ఎక్స్ వేదికగా షేర్ చేశారు. వదర నీటిలో చిక్కుకుని ఒంటరిగా ఉన్న ఈ ఖడ్గమృగాన్ని గమనించినట్లు చెప్పారు. వెంటనే దాన్ని రక్షించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని ముంచెత్తుతున్న వరదలు మానవులను, జంతువులను ఒకేలా ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సాయం చేసేందుకు సహాయక బృందాలు 24 గంటలూ శ్రమిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు

# భక్తజనసంద్రంగా మారిన పూరి క్షేత్రం

## దేశ, విదేశాల నుంచి హాజరైన భక్తులు



ముందడుగు ఒడిశా:


ఒడిశాలోని పూరి క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఆదివారం ఆరంభమైన రథయాత్ర సోమవారం రెండోరోజూ కొనసాగుతున్నది. దాదాపు 53 సంవత్సరాల తర్వాత జగన్నాథుడి రథయాత్ర రెండురోజుల పాటు కొనసాగుతున్న విషయం తెలిసిందే. 1971లో రెండు రోజులపాటు రథయాత్ర జరిగింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఈ యాత్రను రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ నేపథ్యంలో చివరి రోజైన నేడు జగన్నాథుడిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జగన్నాథ రథయాత్రతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. రష్యా నుంచి భారీ సంఖ్యలో భక్తులు పూరికి పోటెత్తారు. రథయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన రష్యా భక్తురాలు మీడియాతో మాట్లాడుతూ జగన్నాథ రథయాత్రలో పాల్గొనేందుకు తాము పలుమార్లు రష్యా నుంచి ఇక్కడకు వచ్చామని చెప్పుకొచ్చారు. జగన్నాథుడు కొలువుతీరిన ఈ పవిత్ర ప్రదేశానికి రావడం తమకు సంతోషంగా ఉందని అన్నారు.

రష్యాలో స్థిరపడిన మరో భక్తురాలు హరిప్రియ మాట్లాడుతూ రథయాత్రలో పాల్గొనడం సంతోషకరమని, తాను ఇక్కడకు రావడం ఇది పదవసారని చెప్పారు. పూరి జగన్నాథుడి పట్ల తనకు పూర్తి విశ్వాసం ఉందని ఆమె తెలిపారు. కాగా, తొలి రోజు రథయాత్రలో అపశ్రుతి చోటచేసుకుంది. రథం లాగుతుండగా భక్తుల మధ్య జరిగిన స్వల్ప తోపులాటలో ఒకరు మరణించగా.. 300 మంది స్వ ల్పంగా గాయపడ్డారు. వారిని వెంటనే దవాఖానలకు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు బంగారు చీపురుతో రథాల ముందు ఊడ్చే చెరాపహారా కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత బలభద్రుని తాళ ధ్వజ రథాన్ని ముందుకు నడిపిస్తుండగా జరిగిన తోపులాటలో ఒక భక్తుడు మరణించాడు.

# నెపోలియన్ వాడిన తుపాకులు వేలం

- భారత కరెన్సీ ప్రకారం రూ.15 కోట్లు పైమాటే
- తుపాకులను జాతీయ సంపదగా ప్రకటించిన ఫ్రాన్స్

ముందడుగు డెస్క్:



ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ బోనాపార్టే వాడిన రెండు పిస్తోళ్లు వేలం వేశారు. వీటిల్లో ఒకటి తన ఆత్మహత్యకు వినియోగించాలని నెపోలియన్ భావించాడు. వీటిని వేలం వేయగా 1.69 మిలియన్ యూరోలకు అవి అమ్ముడుపోయాయి. భారత కరెన్సీ ప్రకారం రూ.15 కోట్లు పైమాటే. బ్లూఫౌంటేన్ ప్యాలెస్ పక్కనే ఉన్న ఓసెనాట్ ఆక్షన్ హౌస్‌లో ఆదివారం వీటి వేలం జరిగింది. అదే ప్యాలెస్‌లో 1814 ఏప్రిల్ 12వ తేదీన నెపోలియన్ ఆత్మహత్య చేసుకోవాలని భావించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. నెపోలియన్ వాడిన తుపాకులను లూయిస్ మెరైన్ గోస్సెట్ అనే కంపెనీ తయారుచేసింది. ఆ కంపెనీ ఆశించిన మొత్తం కంటే ఎక్కువే ఈ వేలంలో లభించింది. ఫ్రాన్స్ ప్రభుత్వం ఈ తుపాకులను జాతీయసంపదగా ఇటీవలే ప్రకటించింది. ఆ తర్వాతే ఈ వేలం వేయడం గమనార్హం. కొత్త నిబంధనల ప్రకారం ఈ వస్తువులను ఎగుమతి చేయడంపై నిషేధం అమల్లోకి రానుంది. అదే సమయంలో ఇవి ఎవరివద్ద ఉంటే వారి నుంచి 30 నెలల్లోపు ఫ్రాన్స్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఈ తుపాకుల తయారీలో బంగారం, వెండి వినియోగించారు. అవి నెపోలియన్ సైనికాధికారి కుటుంబానికి వారసత్వంగా లభించాయి. ఈ వేలంలో తుపాకులు, వాటి బాక్స్, పౌడర్ హార్న్ ఇతర యాక్సెసరీస్‌లు కూడా వేలంలో పెట్టారు. గతంలో నెపోలియన్‌కు చెందిన ట్రైకార్న్ హ్యాట్‌ను వేలం వేయగా 1.9 మిలియన్ డాలర్లు లభించాయి. 1815లో ప్రవాసం నుంచి అధికారం చేపట్టిన నెపోలియన్ బ్యాటిల్ ఆఫ్ వాటర్‌లూలో ఓటమి పాలయ్యారు. 1821లో ఆయన మరణించారు.



# డ్రగ్స్ టెస్టులో నెగెటివ్ వచ్చింది

## మాలో తన సభ్యత్వాన్ని కొనసాగించండి

ముందడుగు హైదరాబాద్:

బెంగళూరు రేవ్ పార్టీలో పట్టుబడటంతో నటి హేమ డ్రగ్స్ తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలతో ప్రాథమిక సభ్యత్వాన్ని 'మూవీ ఆర్టిస్టు అసోసియేషన్' రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె 'మా' అధ్యక్షుడు మంచు విష్ణును కలిసి లేఖ అందించారు. షోకాజు నోటీసు ఇవ్వకుండా తనని మా సభ్యత్వం నుంచి తొలగించడం అన్యాయం అని వాపోయారు. డ్రగ్స్ టెస్ట్ రిపోర్టులో తనకు నెగటివ్ వచ్చిందని, మళ్లీ 'మా'లో తన సభ్యత్వాన్ని కొనసాగించాలని అభ్యర్థించారు. తనకి సపోర్ట్ చేయాలని కోరారు.

ముందడుగు
మంగళవారం, 09-7-2024, హైదరాబాద్

# అతిపెద్ద చిన్నారుల ఆస్పత్రిపై దాడి

## ఉక్రెయిన్‌పై విరుచుకుపడుతున్న రష్యా



ముందడుగు జాతీయం: రష్యా భీకర దాడులతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. రాజధాని కీవ్ సహా దేశవ్యాప్తంగా ఆయా నగరాలపై పెద్దఎత్తున క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో 20 మంది మృతి చెందారు. దాదాపు 50 మందికిపైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. కీవ్‌లోని దేశంలోనే అతిపెద్ద చిన్నారుల ఆస్పత్రి 'ఓఖ్‌మాత్‌డిత్'పైనా దాడి జరిగింది. నాలుగు నెలల వ్యవధిలో రాజధానిపై జరిగిన ఇదే అతిపెద్ద దాడులివే. పేలుళ్ల ధాటికి స్థానికంగా భవనాలు దద్దరిల్లాయి. కీవ్‌లో ఏడుగురు మృతి చెందారు. క్రీవిరీహ్‌లో 10 మంది, దొనెట్స్క్‌లోని పోక్రోవ్స్క్‌లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అత్యాధునిక కింజాల్ రాకెట్లను రష్యా ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన ఆరోపించింది. 40కిపైగా క్షిపణులతో తమ దేశంలోని అయిదు నగరాలను మాస్కో లక్ష్యంగా చేసుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. పిల్లల ఆస్పత్రి భవనం పాక్షికంగా ధ్వంసమైందని, శిథిలాల కింద చిక్కుకుపోయినవారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ వ్యవహారంపై ప్రపంచ దేశాలు మౌనంగా ఉండకూడదని, రష్యా ఏం చేస్తుందో అందరూ చూడాలని సామాజిక మాధ్యమాల వేదికగా పేర్కొన్నారు. అమెరికాలో 'నాటో' శిఖరాగ్ర సమావేశాల వేళ ఈ దాడులు చేసుకోవడం గమనార్హం.

# వైద్యానికి డబ్బుల్లేక బతికున్న చిన్నారి సమాధి

## సజీవ సమాధి చేసినట్టు ఒప్పుకున్న తండ్రి



ముందడుగు పాకిస్తాన్: పదిహేను రోజుల పసికందుకు వైద్యం చేయించేందుకు డబ్బులు లేక ఓ కన్నతండ్రి బతికుండగానే సమాధి చేసేశాడు. ఈ విదారకర సంఘటన పాకిస్థాన్ లో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. పాకిస్థాన్ సింధ్ ప్రాంతంలోని నౌషహ్రో ఫిరోజ్లో ఈ విదారకర సంఘటన వెలుగు చూసింది. నౌషహ్రో ఫిరోజ్‌కు చెందిన తయ్యబ్ భార్య పదిహేను రోజుల క్రితం ఓ ఆడశిశువుకు జన్మనిచ్చింది. అయితే, ఆ పసికందుకు పుట్టినప్పటి నుంచే ఆరోగ్యం నిలకడగా లేదు. తయ్యబ్ తన బిడ్డకు చికిత్స చేయించుకులేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. బిడ్డకు వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఆ పసికందును వదిలించుకోవాలని చూశాడు. ఈ క్రమంలో పదిహేను రోజుల పసికందును ఒక గోనె సంచిలో పెట్టి, ఆ తర్వాత భూమిని తవ్వి, ఆ శిశువును సజీవ సమాధి చేశాడు. పుట్టిన శిశువు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఈ సంఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు దర్యాప్తు ప్రక్రియను చేపట్టారు. అయితే, ఆ పసికందు తండ్రి తయ్యబ్పై పోలీసులకు అనుమానం వచ్చింది. దీంతో అతడిని పట్టుకుని ఆరాతీయగా, విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. చికిత్సకు డబ్బులు లేక, తన పదిహేను రోజుల శిశువును సజీవ సమాధి చేసినట్టు తనే ఒప్పుకున్నాడు.

## నెలసరి సెలవుల వల్ల

# మహిళలకే నష్టం

## ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ▪ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



ముందడుగు ఢిల్లీ: దేశంలో మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఇప్పటికే బీహార్లో 1992 నుంచీ నెలకు రెండు రోజుల పాటు మహిళలకు ఈ సెలవు ఇస్తున్నారు. కేరళలోనూ నెలకు మూడు రోజుల పాటు విద్యార్థినులకు సెలవు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే తరహాలో మిగిలిన రాష్ట్రాల్లోనూ మహిళలు, విద్యార్థినులకు నెలసరి సెలవులు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలన్న నిర్ణయాన్ని సమర్థిస్తూ దీని వల్ల వారిపై పడే ప్రభావాన్ని గుర్తుచేసింది. ముఖ్యంగా మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో వారి ఉపాధి అవకాశాలపై ప్రభావం పడొచ్చని తెలిపింది. నెలసరి సెలవులు ఇవ్వడం వల్ల ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, కానీ యాజమాన్యాలను ఈ సెలవులు ఇవ్వాల్సిందేనని బలవంతం చేయడం వల్ల ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది.

మహిళల ప్రయోజనాల కోసం తాము చేసే ప్రయత్నాలు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారే ప్రమాదం ఉందని అత్యున్నత న్యాయస్థానం గుర్తు చేసింది. కాబట్టి ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పేసింది. దీనిపై కేంద్రాన్ని ఆశ్రయించాలని పిటిషనర్లకు సూచించింది. అలాగే కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి దీనిపై ఫ్రేమ్ వర్క్ రూపొందించాలని సుప్రీంకోర్టు సలహా ఇచ్చింది.

# 2029లో షర్మిల ఏపీ సీఎం అవుతుంది

## ▪ రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
## ▪ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



ముందడుగు ఆంధ్రప్రదేశ్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి విజయవాడలో ఘనంగా జరిగాయి. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ షర్మిలను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2029లో షర్మిల ఏపీ సీఎం అవుతుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని అన్నారు.

ఏపీలో ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉందని, బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని అన్నారు. చంద్రబాబు, జగన్, పవన్.. మోదీ పక్షమే అని, ప్రజల పక్షాన పోరాడబోయేది షర్మిల మాత్రమే అని అన్నారు. కడపలో ఉప ఎన్నికలు రాబోతున్నాయని వార్తలొస్తున్నాయి, కడపలో ఊరూరు తిరిగే బాధ్యత నేను తీసుకుంటానని అన్నారు రేవంత్ రెడ్డి. వైఎస్ పేరుతో వ్యాపారం చేసేవాళ్లు వారసులు కాదు, ప్రజల కోసం పోరాడేవాళ్లే వైఎస్ వారసులని రేవంత్ రెడ్డి అన్నారు.

ముందడుగు
మంగళవారం, 09-7-2024, హైదరాబాద్

## జనరేషన్ గ్రీన్ క్యాంపెయిన్‌కు సహకారాన్ని అందించనున్న ఎఐసిటిఈ మరియు ఒప్పో ఇండియా




ముందడుగు హైదరాబాద్: ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మరియు ఒప్పో ఇండియా నేడు తమ 'జనరేషన్ గ్రీన్' క్యాంపెయిన్‌ను ప్రకటించాయి. ఇది 100-రోజుల కార్యక్రమం-1M1B (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ద్వారా నిర్వహిస్తుండగా, భారతదేశంలోని కళాశాలల్లో 5,000 ఇంటర్న్‌షిప్ అవకాశాల ద్వారా యువతలో గ్రీన్ నైపుణ్యాలను ప్రోత్సహిస్తుంది.

"గ్రీన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ కోసం ఒప్పో ఇండియాతో ఎఐసిటిఈ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం పట్ల గర్వంగా ఉంది" అని ఎఐసిటిఈ ఛైర్మన్ డాక్టర్ టీజీ సీతారాం హర్షా న్ని వ్యక్తం చేశారు. "విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు, పర్యావరణ సవాళ్లను అధిగమించేందుకు మరియు పర్యావరణ అనుకూల ప్రపంచాన్ని నిర్మించడంలో దోహదపడే సుస్థిరత ప్రయత్నాలకు దోహదం చేయడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. ముఖ్యంగా ఎఐసిటిఈ ద్వారా ఇంటర్న్‌షిప్‌లను అందిస్తున్న మొదటి ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ ఒప్పో ఇండియా. ఈ క్యాంపెయిన్ ఎఐసిటిఇ విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం 1 కోటి ఇంటర్న్‌షిప్ మిషన్‌లో భాగం మరియు యుఎన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదం చేస్తుంది.

## బీసీసీఐ ఇచ్చిన రూ.125 కోట్లలో
# ఎవరెంత తీసుకున్నారు
### జట్టులో ఉండీ ఒక్క మ్యాచ్ ఆడని వారికి రూ.5 కోట్లు




ముందడుగు క్రీడలు: టీ20 వరల్డ్ కప్ లో విజేతగా నిలిచిన టీమిండియాకు బీసీసీఐ రూ.125 కోట్ల నజరానాను ప్రకటించింది. వరల్డ్ కప్ గెలిచిన జట్టులో ఉన్న క్రికెటర్లతో పాటు పెవిలియన్ కు పరిమితమైన వారు, సపోర్టింగ్ స్టాఫ్ అంతా ఈ బహుమతిని పంచుకోవాల్సి ఉంది. ఇందులో ఎవరి వాటా ఎంత లభించనుందనే దానిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. దీనిపై ఎట్టకేలకు క్లారిటీ లభించింది. తాజా నివేదిక ప్రకారం జట్టులో ఉండీ ఒక్క మ్యాచ్ కూడా ఆడని వారితో సహా భారత జట్టులోని 15 మంది సభ్యులకు రూ. ఒక్కొక్కరికి 5 కోట్లు లభించబోతున్నాయి. అలాగే టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కు కూడా రూ.5 కోట్లు ఇస్తున్నారు.ఇక ద్రవిడ్ కోచింగ్ స్టాఫ్ విషయానికొస్తే.. బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్, ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్, బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే సహా వారందరికీ రూ. ఒక్కొక్కరికి 2.5 కోట్లు లభించనున్నాయి. అలాగే అజిత్ అగార్కర్‌తో సహా సెలక్షన్ కమిటీ సభ్యులకు ఒక్కొక్కరికి 1 కోటి చొప్పున ఇవ్వనున్నారు. సహాయక సిబ్బందిలో ముగ్గురు ఫిజియోథెరపిస్ట్‌లు, ముగ్గురు త్రోడౌన్ స్పెషలిస్టులు, ఇద్దరు మసాజర్‌లు, స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్‌లకు ఒక్కొక్కరికి రూ.2 కోట్లు చొప్పన ఇవ్వనున్నారు. బీసీసీఐ సెలక్షన్ కమిటీ టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో పాటు నలుగురు రిజర్వ్ ఆటగాళ్లను కూడా తీసుకుంది. వీరిలో రింకూ సింగ్, శుభమాన్ గిల్, అవేష్ ఖాన్, ఖలీల్ అహ్మద్ కు ఒక్కొక్కరికి కోటి రూపాయల రివార్డ్ లభించనుంది. ఈ వివరాలను ఇప్పటికే ఆటగాళ్లు, స్టాఫ్, కోచ్ లు, సెలెక్టర్లకు అందించినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా టీమిండియాకు రూ.11 కోట్ల నగదు బహుమతి ప్రకటించింది.

## టీమ్ఇండియా మరిన్ని విజయాలు సాధించాలి
### ప్రముఖ క్రికెటర్ శ్రీశాంత్



ముందడుగు హైదరాబాద్: ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2024 ట్రోఫీని భారత్ గెల్చుకున్న సందర్భంలో శ్రీశాంత్ ఇలా వ్యాఖ్యానించారు:"మనం ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2024 ట్రోఫీని అందుకుని పైకి ఎత్తినప్పుడు, నేను టీమ్ఇండియా సాధన పట్ల గర్వంతో మునిగిపోయాను. ఈ టోర్నమెంట్‌లో మా ప్రయాణం అసాధారణమైనదికాదు. కఠినమైన, స్థితిస్థాపకతతో కూడిన క్షణాలు చరిత్రలో నిలిచిపోతాయి. ఈ విజయం మనకే కాదు,మన అభిరుచిని, నమ్మకాన్ని పంచుకునే ప్రతిభావంతులైన వ్యక్తుల సమూహానికి నాయకత్వం వహించడం విశేషం. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

## నియోజకవర్గ ఓటర్లకు
# ఎంపీ మందు పార్టీ

- భారీ సంఖ్యలో క్యూ కట్టిన మందుప్రియులు
- పోలీసులే బందోబస్తు నిర్వహించడం గమనార్హం



ముందడుగు కర్ణాటక: కర్ణాటకలో భాజపా ఎంపీ మద్దతుదారులు ఉచితంగా 'మద్యం' పంపిణీ చేయడం చర్చనీయాంశమయ్యింది. దీనికి భారీ సంఖ్యలో మందుప్రియులు క్యూ కట్టగా.. పోలీసులే బందోబస్తు నిర్వహించడం గమనార్హం. ఈ నేపథ్యంలో భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఈ వ్యవహారంపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్ణాటక మాజీ మంత్రి, భాజపా నేత కె.సుధాకర్ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో చిక్కబళ్లాపుర్ నుంచి విజయం సాధించారు. ఈ సందర్భంగా స్థానికంగా కృతజ్ఞత కార్యక్రమం ఏర్పాటు చేసిన ఆయన మద్దతుదారులు.. ఉచితంగా మద్యం పంపిణీ చేపట్టారు. దీనికి జనం ఎగబడ్డారు. భారీ 'క్యూ' లైను ఉండగా.. ఆ తతంగాన్నంతా పోలీసులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి బందోబస్తు నిర్వహించాలని ఎంపీ సుధాకర్ స్థానిక పోలీసులకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై స్పందించిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. భాజపాపై మండిపడ్డారు.



## అశ్విన్ ఇక ఫ్రాంచైజీ ఓనర్

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఫ్రాంచైజీ కో ఓనర్ అయ్యాడు. గ్లోబల్ చెస్ లీగ్‌లో అతడు 'అమెరికన్ గాంబిట్స్' ఫ్రాంచైజీలో సహ యజమానిగా పెట్టుబడులు పెట్టాడు. టెక్ మహీంద్ర, అంతర్జాతీయ చెస్ సమాఖ్య సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ లీగ్ రెండో ఎడిషన్ రానున్న అక్టోబర్‌లో మొదలుకానుండగా తాజాగా ఇందుకు సంబంధించిన ఓ జట్టు రిప్లేస్‌మెంట్‌ను నిర్వాహకులు ప్రకటించారు. 'చింగారి గల్ఫ్ టైటాన్స్' స్థానంలో అమెరికన్ గాంబిట్స్ బరిలో దిగనుంది. అక్టోబర్ 3 నుంచి 12 దాకా లండన్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీ రెండో ఎడిషన్‌లో అల్పైన్ ఎస్‌సీ పైపర్స్, పీబీజీ అలస్కన్ నైట్స్, గ్యాంగ్స్ గ్రాండ్‌మాస్టర్స్, త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ ఇతర జట్లుగా ఉన్నాయి. ప్రముఖ వ్యాపారవేత్తలు పీపీ ప్రచుర, వెంకట్ కె నారాయణతో కలిసి అశ్విన్.. అమెరికన్ గాంబిట్స్‌లో పెట్టుబడులు పెట్టాడు.

ముందడుగు
మంగళవారం, 09-7-2024, హైదరాబాద్

# స్పిరిట్ కోసం హాలీవుడ్ విలన్?



ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' స్పీడ్ మామూలుగా లేదు. ఇప్పటికే వెయ్యికోట్ల మార్క్‌కు చేరవగా వచ్చేసింది. మరి ఈ వేగానికి బ్రేక్ ఎక్కడ పడుతుందో ఇప్పడైతే ఎవరికీ క్లారిటీ లేదు. ఈ ప్రయాణంలో ఎన్ని రికార్డులు బద్దలవుతాయో కూడా చెప్పలేం. ఇప్పటికే పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా ఎదిగిన ప్రభాస్, 'కల్కి 2898ఏడీ' దెబ్బకి పాన్‌వరల్డ్ సూపర్‌స్టార్‌గా మారారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకేనేమో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తన 'స్పిరిట్' సినిమాను పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ సినిమా బడ్జెట్ మూడొందల కోట్ల పైనే అని తెలుస్తున్నది. టి.సిరీస్, భద్రకాళి ప్రొడక్షన్స్ కలిసి నిర్మించనున్న ఈ పాన్ వరల్డ్ సినిమాలో విలన్‌గా హాలీవుడ్ స్టార్ విలన్ లీ డాంగ్ సిక్‌ని తీసుకునేదుకు నిర్ణయించారట. అప్పడే ఆయనతో సంప్రదింపులు కూడా మొదలయ్యాయని సమాచారం. ట్రైన్ టూ బూసాన్, మార్వెల్ సిరీస్ ఎటర్నల్ సినిమాల ద్వారా ఈ సౌత్ కొరియన్ యాక్టర్ ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా కథ ఇంటర్నేషనల్ స్థాయిలో ఉంటుందట.

అందుకే హాలీవుడ్ నటులపై దృష్టిసారించారు సందీప్‌రెడ్డి వంగా. ఇందులో ప్రభాస్ రెండు భిన్న కోణాల్లో కనిపిస్తారట. అందులో ఒకటి రఫ్ అండ్ రగ్గడ్‌గా ఉంటే.. రెండోది స్టైలిష్‌గా ఉంటుందట.

ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్‌ఆఫీసర్‌గా కనిపిస్తారని గతంలో సందీప్‌రెడ్డి చెప్పారు. మరి ఈ రెండు గెటప్పల్లో పోలీస్ గెటప్ దేనిదో తెలియాల్సివుంది. ఇందులో ప్రభాస్‌ది డ్యూయెల్ రోలా? లేక ఒకే పాత్రలో రెండు పార్శ్వాలుంటాయా? అనే విషయంలో కూడా క్లారిటీ రావాల్సివుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది.

# ఇది పొగరుతో చెబుతున్న మాట కాదు



'అస్కార్ అవార్డును ప్రత్యేకంగా పరిగణించను. భారతీయ నటుడిగా ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలన్నదే నా కల. ఇది పొగరుతో చెబుతున్న మాట కాదు. నాపై నాకున్న నమ్మకంతో చెబుతున్నమాట.' అని కమల్‌హాసన్ అన్నారు. ఆస్కార్ అవార్డు గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కమల్ పై విధంగా స్పందించారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. 1996లో వచ్చిన 'భారతీయుడు' సినిమాకు సీక్వెల్‌గా శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్ మాట్లాడారు. 'సినిమాకు కథే ముఖ్యం. కథ డిమాండ్ మేరకే పాత్రలుండాలి. ఈ సినిమాలో కమల్‌సార్ పాత్ర నిడివి తక్కువ అని చాలామంది అనుకుంటున్నారు. అందులో నిజంలేదు. ఇందులో ఆయన లేని సన్నివేశంలో కూడా ఆయన గురించే చర్చ నడుస్తుంటుంది. పార్ట్ 1లో అవినీతిపై పోరాటం చూపించాను. ఈ పార్ట్‌లో పోరాటం వైవిధ్యంగా ఉంటుంది.' అని శంకర్ అన్నారు. కథ డిమాండ్ మేరకే మూడో పార్ట్ కూడా తెస్తున్నామని, డబ్బుకోసంకాదని, 'భారతీయుడు2' యూనివర్సల్ సబ్జెక్ట్ కాబట్టే ఇన్ని పార్టులు తీయాల్సి వచ్చిందని శంకర్ తెలిపారు. 'భారతీయుడు 2'లో భాగం కావడంపట్ల హీరో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఈ సినిమాకు పంపిణీదారుడైన ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు, బాబీ సింహా కూడా పాల్గొన్నారు.



# రాధిక 3.0గా ప్రియాంక?

టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలు సక్సెస్ సాధించడం చాలా అరుదు. కానీ ప్రియాంక జవాల్కర్ తొలి సినిమా 'టాక్సీవాలా'తోనే హిట్ కొట్టేసి, లక్కీ హీరోయిన్ అనిపించుకుంది. చూడ్డానికి నార్త్ అమ్మాయిలా ఉండటం కూడా ప్రియాంకకు కలిసొచ్చిందని చెప్పాలి. రెండో సినిమా 'ఎస్ఆర్ కళ్యాణమండపం'తో ద్వితీయ విఘ్నాన్ని కూడా దాటేసింది. హిట్టయిన రెండూ చిన్న సినిమాలే కావడంతో ప్రియాంకకు అవకాశాలు పెద్దగా రాలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ అందాలభామ బంపర్‌ఆఫర్ కొట్టేసిందని తెలుస్తున్నది. 'టిల్లు స్కేర్'లో క్షణకాలం మెరిసిన ప్రియాంక, 'టిల్లు క్యూబ్'లో రాధిక 3.0గా కనిపించనుందని ఇన్‌సైడ్ టాక్. 'డీజే టిల్లు'లో రాధికగా నేహాశెట్టి నటించింది. ప్రస్తుతం అందరూ ఆమె పేరును మర్చిపోయి, రాధిక అనే పిలుస్తున్నారు. 'టిల్లు స్కేర్'లో కథానాయిక లిల్లీగా అనుపమాపరమేశ్వరన్ నటించినా, ఆమెను అందరూ రాధిక 2.0 అనే పిలుస్తున్నారు. ఇప్పడు 'టిల్లూ క్యూబ్'లో ప్రియాంక జవాల్కర్ నటించనున్నట్టు వార్తలు బలంగానే వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే ఈ ముద్దుగుమ్మ కూడా రాధిక 3.0గా మారిపోవడం ఖాయం. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ వేరే సినిమా పనిలో బిజీగా ఉన్నారు. ఆ సినిమా తర్వాత 'టిల్లూ క్యూబ్' ఉంటుందని తెలుస్తున్నది.